# చిలుకు

పోయిన వారం కబుర్లలో 'అప్పుడేమవుతుంది? చూద్దాం!' అనుకున్నాం కదా! చూద్దాం ఏమవుతుందో!

మనవాడు అక్కడవున్న కోకోకోలాలాటి పానీయాలో, ఇంకాస్త కిక్కిచ్చే సురాపానాలో సేవిస్తూ కూర్చుంటాడు, రాబోయే పన్నెండేళ్ళ అమ్మాయి కోసం.

లోపలినించీ ఒక అమ్మాయి - 'వస్తున్నాను! ఒక్క నిమిషం' అంటుంది.

ఇతని ముఖం వికసిస్తుంది. ఒకే ఒక్క నిమిషంసేపు. ఎందుకంటే వచ్చేది టీవీ రిపోర్టర్. డేట్‌లైన్ కార్యక్రమం చూసే కొంతమందికి అతను తెలుసు కానీ మిగతా వాళ్ళకి తెలీదు. బహూశా ఆ అమ్మాయి తండ్రేమో అనుకుంటారు.

చేతిలో వున్న కాగితాలు చూస్తూ 'నీ పేరు బాబ్ (లేదా మారియో, లేదా బాబు) కదూ' అంటాడు.

అతను అవునన్నాక 'నువ్వెంత దూరం డ్రైవ్ చేసుకు వచ్చావు' అంటాడు. కొంతమంది పదిహేను మైళ్ళు అంటే కొంతమంది వంద మైళ్ళు అంటారు.

'అంటే ఇంతదూరం పన్నెండేళ్ళ అమ్మాయితో కామకలాపాల కోసం వచ్చావన్నమాట' అంటాడు. కొంతమంది తల వంచుకుంటారు. కొంతమంది 'లేదు ఊరికే సరదాగా కబుర్లు చెప్పుకుందామని వచ్చాం. మీ అమ్మాయి సరదా మనిషి' అంటారు. వయసులో కొంచెం పెద్దగా వున్న వ్యక్తులయితే 'చిన్న పిల్ల. నా కూతురు లాంటిది. ఇలాటి పనులు చేస్తుంటే మందలించటానికి వచ్చాను' అంటారు.

అందరికీ ఒకే సమాధానం, రిపోర్టర్ చేతిలో వున్న కాగితాల్లో వుంటుంది. వాళ్ళ ఇంటర్నెట్ సంభాషణ అంతా ప్రింట్ చేసిన కాగితాలు. ప్రతి అక్షరమూ, ప్రతి మాటా, వాక్యమూనూ. అవి చదివాక వాళ్ళ ముఖాలు వాడి పోతాయి.

'మీరు పోలీసులా? నన్ను అరెస్టు చేస్తారా' అని కూడా అడుగుతారు కొందరు.

అప్పుడే కెమెరామన్ భుజం మీద టీవీ కెమెరాతో అక్కడికి వస్తాడు.

'చెయ్యను నాకా అధికారం లేదు. నేను ఫలానా టీవీ రిపోర్టర్ని. కాకపోతే ఈ కార్యక్రమం అంతా టీవీలో వస్తుంది'

కొందమంది భయపడి.. ఏడుస్తారు కూడాను, నా జీవితం నాశనమయి పోయింది అనీ, నా పెళ్ళాం పిల్లలూ చూస్తే ఎలా అనీ... రకరకాలుగా. కొంతమంది అయితే 'ఇది నామొదటి తప్పు. దయచేసి వదిలేయండి. ఇంకెప్పుడు చేయను. ఈ టేపు టీవీలో చూపించకండి' అని ప్రాధేయపడతారు.

టీవీ రిపోర్టర్ ఆ విషయాలేమీ మాట్లాడకుండా ఇక వెళ్ళిరమ్మంటాడు.

'ఇంకా నయం. జైల్లోకి తోశారు కాదు' అనుకుంటూ అతను ఇంట్లో నించీ బయటికి రాగానే, తుపాకులతో సిద్ధంగా వున్న ఓ నలుగురు పోలీసులు అతన్ని చుట్టుముట్టి 'బాబ్ లేదా బాబూ! నిన్ను అరెస్ట్ చేస్తున్నాం' అని అతన్ని నేల మీద బోర్లా పడుకోబెట్టి, చేతులు వెనక్కి విరిచి, సంకెళ్ళు వేసి, అత్తగారింటికి పట్టుకుపోతారు.

వీళ్ళందరికీ అమెరికన్ న్యాయశాస్త్రం ప్రకారం నాలుగేళ్ళనించీ ఇరవై ఏళ్ళ దాకా జైలు శిక్ష వేస్తారు.

ఇంకో విషయం చెప్పటం మరిచిపోయాను. ఇలాటి పెద్దపులులని పట్టుకోవటానికి వేసిన శిబిరాలు, ముఖ్యంగా పది పన్నెండేళ్ళ అమ్మాయిల్ని అమానుషంగా మానభంగం చేసి, హత్య చేసిన వూళ్ళల్లో నిర్వహించారు!

నెలకి రెండు మూడు సార్లు వచ్చే ఈ కార్యక్రమంలో, ప్రతిసారీ ముగ్గురు నలుగుర్ని చూపిస్తారు. వారిలో కనీసం ఒక్కళ్ళు 'మనవాళ్ళు' వుండటం ఆనవాయితీ అయిపోయింది. ఒక వారం అయితే మనవాళ్ళు ఇద్దరు. ఒకతను తమిళ్, ఇంకో అతను తెలుగు. ఆ ఇద్దరూ ఎవరయినా కానీయండి ఇద్దరికీ ఒకే తెగులు!

తెలుగాయన పెళ్ళి చేసుకుని, పిల్లలు కూడా వున్న ముఫై ఏళ్ళ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్. ఈమధ్యనే ఇండియానించీ అమెరికా వచ్చాడు.

తల చేతుల్లో పెట్టుకుని ఏడుస్తూ 'ఈ విషయం మా ఆవిడకీ స్నేహితులకీ తెలిస్తే నా పరువు పోతుంది' అన్నాడు. నేషనల్ టీవీలో దేశంలో అందరూ చూడ బోతున్నారని రిపోర్టర్ చెప్పగానే అతనికి పరువు పోవటమే కాక తన జీవితం కూడా నాశనం అయిందని అర్థమయింది. బయట పోలీసులు చేతులు విరిచి సంకెళ్ళు వేసి జైలుకి తీసుకువెళ్ళిన తర్వాత మరి ఇంకా ఏం నాశనం అయిందనుకున్నాడో?

0 0 0

ఇలాటి షో చూసిన ఒక రాత్రి ఈ విషయమే, ముఖ్యంగా మన దేశీయులు ఇలా ఎందుకు చేస్తున్నారని ఆలోచిస్తూ కూర్చున్నాను. ఇండియానించీ అమెరికా వచ్చే వాళ్ళల్లో, అందులోనూ దక్షిణ రాష్ట్రాలైన ఆంధ్ర, తమిళ్‌నాడు, కర్ణాటక, కేరళల నించీ ఎంతో కష్టపడి చదువుకున్నవాళ్ళూ, తెలివైనవాళ్ళూ రావటం ఎక్కువగా చూస్తుంటాం. దక్షిణ రాష్ట్రాలు కొంచెం సాంప్రదాయ సిద్ధంగా వుండటం కూడా నా అనుభవంలో కద్దు. మరి ఇలాటి వారికి ఇదేం బుద్ధి?

ఇటు చక్కటి హైటెక్ ఉద్యోగం. చాలమంది అమెరికన్స్ కన్నా మంచి ఇల్లు, జీవితం, పండంటి సంసారం, పుట్టిన దేశంలోనూ, మెట్టిన దేశంలోనూ పరువూ ప్రతిష్ఠ. ఎందుకని ఒకే ఒక్క పొరపాటుతో జీవితాలు జైలుపాలు

చేసుకుంటున్నారు?

వీళ్ళు జీవితంలో సెక్స్ కరువైన వాళ్ళా? కాదు. కొత్తగా పెళ్ళి చేసుకుని కాపురాలు చేసుకుంటున్నవాళ్ళూ, చిన్న చిన్న పిల్లలు వున్నవాళ్ళూ!

మరి మన సినిమాలల్లో అన్నీ కనబడేటట్లు బట్టలు కట్టుకుని (లేదా విప్పుకుని) చేసే చౌకబారు ఊర్పుల నిట్టూర్పుల కుప్పిగంతులు యువతరాన్ని తప్పుదారిలో నడిపిస్తున్నాయా? దేశ విదేశీ సైకాలజిస్టుల గణాంకాల ప్రకారం, టీవీ, సినిమాలు, పుస్తకాలూ మానవ స్వభావాలపై ఎంతో ప్రభావం కలుగచేస్తాయని నిర్వివాదంగా చెబుతున్నాయి. తెలుగువాళ్ళల్లో అధిక సంఖ్యాకులకి పుస్తకాలు చదివే అలవాటు లేదు కనుక, ఈ ప్రభావం ఎక్కడినించీ వస్తున్నదో తెలుసుకోవటానికి పెద్ద ఆలోచనా అఖ్ఖర్లేదు, ఐన్‌స్టీన్‌లం అవాల్సిన అవసరమూ లేదు.

భారతదేశంలోలాగ 'లా ఒక్కింతయు వుండదు' అనే అపోహతో చేస్తున్నారా? (ఇండియాలో గవర్నమెంటాలిటీ అనుభవించాను కనుకా, ఇప్పుడు చూస్తున్నాను కనుకా, ఈ మాట కొంచెం బాధగా వున్నా, నిజం కనుక వ్రాస్తున్నాను) అలా అనుకోవటానికీ వీల్లేదు. మన తెలుగు వీరుడు టీవీ రిపోర్టర్‌తో అంటాడు, 'నేను ఇది ఈ మధ్యనే టీవీలో చూశాను. అలాటిదేమోనని అనుమానం వచ్చింది కానీ, ఇలా అవుతుందనుకోలేదు' అని.

మర్నాడు ఆఫీసులో ఈ షో చూశామనీ, ఇండియన్స్ కూడా ఇలాటి వాటిల్లో దిగుతున్నారే అని అడిగిన అమాండాకీ, నవ్విన నాన్సీకీ అంతకుముందు నేను చెప్పిన భారతీయ సంస్కృతీ, సంప్రదాయం, హిందూమతం కథలు ఆటలో అరటిపళ్ళేనా?

అసలివన్నీ పక్కన పెడదాం, మన విలువలు ఏమయాయి? చిన్నపిల్లలతో ఇలాటివి చేయటం న్యాయ సమ్మతం కాదని తెలుసు. అలా అయినా, కాకపోయినా ధర్మ సమ్మతమా?

మతాన్ని నమ్మేవాళ్ళూ, దేవుడ్ని నమ్మేవాళ్ళూ, మానవత్వాన్ని నమ్మేవాళ్ళూ, తమ విలువలకి విలువ ఇచ్చేవాళ్ళూ .... ఎవరయినా సరే... వాళ్ళ 'లోపల' వున్నవాడిని ఎలా సమాధాన పరుస్తారు, ఆ 'లోపల' ఎవరూ లేకపోతే తప్ప!

విలువలు వలువలు కాదు విడిచి పారేయటానికి. అవి ఒక సంస్కృతికీ, సంప్రదాయానికీ, మతానికీ, దేశానికీ పరిమితం కాదు. మానవత్వానికి సంబంధించినవి. ఒక మనిషి మనిషిగా బ్రతకటానికీ, సాటి మనిషిని గౌరవించటానికీ అవెంతో అవసరం!

అందుకే వాటిని కాపాడుకోవటం మన ధర్మం!

మానవ ధర్మం!

0 0 0